రాజ్యాంగ బద్ధంగానే, రాజకీయంగానే తెలంగాణ ఏర్పాటు జరుగుతుందని బలంగా నమ్మారు. ప్రజలకూ నమ్మకం కలిగించారు. వాళ్లను ఉద్యమంలో భాగం చేయడంలో సఫలమయ్యారు. రాజకీయంగా రాజీలేని పోరాటం చేస్తే.. తెలంగాణ తథ్యమని పదే పదే పిలుపునిచ్చారు. అహింసా పద్ధతిలో పోరాటానికి సిద్ధమైన కేసీఆర్‌ను నిలువరించడం అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద చిక్కే అయింది. శాంతియుతంగా సభలు నిర్వహించుకుంటే ఎలా ఆపగలరు? భావజాలాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు పన్నినా కేసీఆర్ చాణక్యం ముందు అవి పనిచేయలేదు.

***

ఉద్యమానికి ఉద్యుక్తుడైన రోజు కేసీఆర్ దగ్గర ఏముంది? ధనం లేదు. బలం లేదు. బలగం లేదు. ఏ ప్రాంతం కోసం పోరాటానికి సిద్ధమయ్యాడో అదీ ఒక్కుమ్మడిగా తన వెంట నడుస్తుందన్న నమ్మకమూ లేదు. వాక్కు తప్ప మరే దిక్కూ లేదు! ఆ మాటనే తూటాగా పేల్చారు కేసీఆర్. ఉమ్మడి పాలకులు నీళ్ల విషయంలో తెలంగాణను ఎలా ముంచుతున్నారో అర్థమయ్యేలా చెప్పారు. మన నిధులను ఎలా తరలించుకుపోతున్నారో విడమర్చారు. నియామకాలను ఎలా తన్నుకుపోతున్నారో విశ్లేషించారు. శాంతి, అహింసతోనే రాష్ట్రాన్ని సాధించుకుందామని పిలుపునిచ్చిన ఆయనే... ఉద్యమంలో వెనక్కి తగ్గితే తనను రాళ్లతో కొట్టి చంపండని పిలుపునివ్వడం ఓ సంచలనం. దీంతో అన్నాళ్లూ మేధావుల చర్చల్లో, చిన్నచిన్న సమావేశాల్లో పొడిపొడిగా వినిపించిన తెలంగాణం ఎన్నికలను ప్రభావితం చేసేంతగా ప్రజల్లో నానింది. ఆయన ఉద్యమాన్ని నడిపిన విధానం.. భౌగోళికంగా మన రాష్ట్రాన్ని రూపుమాపిన కాంగ్రెస్ కూడా తెలంగాణ ఏర్పాటును ఎన్నికల హామీగా ప్రకటించేలా చేసింది. కరుడుగట్టిన సమైక్య పార్టీనీ 'జై తెలంగాణ' అనేలా చేసింది. గల్లీలో పుట్టిన నినాదం ఢిల్లీ దాకా చేరడంలో ఆయన ఎత్తుగడలే నిచ్చెనలయ్యాయి.

***

2004 సార్వత్రిక ఎన్నికల వేళకు తెలంగాణ పల్లెపల్లెకూ చేరింది. గడప గడపకూ పాకింది. ఊరూరా గులాబీ జెండాలు రెపరెపలాడాయి. తెలంగాణ పాటలు మార్మోగాయి. అప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ అఖండ విజయం రాజకీయ వర్గాల్లో పెద్దచర్చకు దారితీసింది. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగా పోరాటం చేయాలనుకున్నారు కేసీఆర్. కానీ, తెలంగాణవాదమే గెలవాలన్న ఏకైక సంకల్పం... పొత్తు కోసం కాళ్లబేరానికి వచ్చిన కాంగ్రెస్ మాటను కేసీఆర్ మన్నించేలా చేసింది. ఎన్నికలయ్యాయి. టీఆర్ఎస్ పొత్తుతో కాంగ్రెస్ గద్దెనెక్కింది. రాజకీయ ప్రక్రియ వేగవంతం చేయాలి. తెలంగాణ అంశాన్ని కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో పెట్టి చేతులు దులుపుకొన్నది కాంగ్రెస్. వాయిదాల రాగం ఎత్తుకుంది. దారులు మూసుకుపోయాయి. 'ఇంకేముంది అంతా అయిపోయింది. పదవులు తీసుకున్నారు..' అని కేసీఆర్ మీద విమర్శలు ఎక్కుపెట్టారు. మళ్లీ సందిగ్ధం, సంక్లిష్టత! తెంపుకొంటే చేసిందంతా తుంచుకున్నట్టే! పట్టుకుంటే ఉద్యమం కట్టు తప్పిందన్న నిందలు. 'ఇంత దూరం తీసుకొచ్చినవ్ నువ్వే! కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో పెట్టించినవ్... ఇప్పుడు వెనక్కిపోతే ఇబ్బంది' అని దగ్గరి వ్యక్తుల సలహాలు. లౌక్యంగా బయటపడాలన్నది కేసీఆర్ వ్యూహం. మరోవైపు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాలు పెరిగాయి. పోతిరెడ్డిపాడు విషయంలో ఆ ప్రభుత్వ వైఖరికి, తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణికి నిరసనగా కేసీఆర్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా అస్త్రం సంధించారు.

## కేసీఆర్‌తోనే అయితది



జయశంకర్ సార్, కేసీఆర్ ప్రయాణం తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టం. ఇద్దరి మధ్యా ఉదాత్తమైన అనుబంధం ఉండేది. వీరిద్దరూ విభేదించుకున్న సందర్భాల్లేవు. ఉద్యమ సమయంలో ఇద్దరూ కలిసే ఉన్నారు. అయితే, కేసీఆర్‌ను ఆయన్నుంచి విడదీసి చూపించే ప్రయత్నం ఎందరో చేశారు. కానీ, వారిద్దరి మధ్య అలాంటి పరిస్థితి ఒక్కనాడూ తలెత్తలేదు. కేసీఆర్‌తోనే తెలంగాణ సాధ్యమైతదని ఆయన బలంగా నమ్మారు. తెలంగాణ బాధను కేసీఆర్ అర్థం చేసుకున్నంతగా మరెవరూ అర్థం చేసుకోలేదని చెబుతుండేవారు. 'తెలంగాణ ఆవేదన, ప్రత్యేకరాష్ట్ర ఆవశ్యకత గురించి నేను చాలామందికి చెప్పిన. నేను చెప్పినదాన్ని అర్థం చేసుకోవడమే కాదు, దాన్ని ప్రజలకు అరటిపండు ఒలిచి ఇచ్చినట్టుగా కేసీఆర్ వివరించగలిగాడు. తెలంగాణ వాదాన్ని ప్రజల మనసుల్లో ఇంకే విధంగా ఆయన చెప్పిన విధానం అద్భుతం. రాష్ట్రం ఎందుకు కోరుకుంటున్నమో మూలాన్ని పట్టుకున్నడు. రాష్ట్రం సాధించి తీరాలన్న పట్టుదల ఆయనలో కనిపించింది. పొలిటికల్ ప్రక్రియలో, వ్యూహరచన ధురంధరుడు' అని కేసీఆర్ గురించి జయశంకర్ సార్ చెప్పేవారు. కేసీఆర్‌లో కొన్ని వ్యత్యాసాలు గమనించినప్పటికీ.. అవి రాజకీయ ఎత్తుగడలో భాగంగా తప్పవని అర్థం చేసుకునేవారు. ఆమరణ నిరాహార దీక్ష సమయంలో జయశంకర్ సార్ చిన్న బ్యాగ్‌తో ఖమ్మం హాస్పిటల్‌కు వచ్చారు. తండ్రిలా ఆయన వెంట ఉన్నారు. నిరాహార దీక్ష కొనసాగుతుందని జయశంకర్ సార్ ప్రకటనతో కాంగ్రెస్ కుట్రలకు తెరపడ్డట్టయింది. మరో సందర్భంలో 'నా సలహాలు కేసీఆర్ వినని సందర్భాలు ఉన్నాయి. కేసీఆర్ సలహాలు నేను వినని సందర్భాలూ ఉన్నాయి. నేనిచ్చిన సలహాలు కొన్నిసార్లు రాజకీయ ఎత్తుగడల్లో ఇమడకపోవచ్చు. నేను కాదన్న నిర్ణయాలు లాభించినవీ ఉన్నాయి' అని జయశంకర్ సార్ చెప్పడం వారి మధ్య ఉన్న అవగాహనకు నిదర్శనం.

## ఒకసారి డిసైడ్ అయితే..



ప్రతి వ్యక్తి జీవితంలో ఆటుపోట్లు సహజం. గెలుపు ఓటముల సమాహారమే జీవితం. అయితే కేసీఆర్ సాధించిన విజయాల ముందు వైఫల్యాలు చాలా తక్కువ. గెలుపును ఎంత నిరాడంబరంగా స్వీకరిస్తారో.. ఓటమినీ అంతే హుందాగా అంగీకరిస్తారు. అంతేకానీ, నిస్పృహకు గురవ్వరు. ఓటమిపై లోతుగా విశ్లేషించుకుంటారు. వ్యూహానికి పదును పెడతారు. తనలోకి తను వెళ్లిపోతారు. ఉన్న స్థితిని దర్శిస్తారు. మళ్లీ తిరుగులేని విశ్వాసంతో, ధీమాగా వస్తారు. పునరాగమనంలో సంశయాలకు, సందేహాలకు, భయాలకు తావు ఉండదు. ఒక విషయాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకునేదాకా అధ్యయనం కొనసాగిస్తారు. ఆయన్ను ఎవరూ కమాండ్ చేయలేరు. అలాగని ఎవరూ ఆయన ముందు మాట్లాడరు అనుకుంటే పొరపాటు! చర్చోపచర్చల్లో అందరి అభిప్రాయాలనూ కూలంకషంగా, ఓపికగా వింటారు. వాటికి రాజకీయ రూపాంతరం ఇచ్చేటప్పుడు మాత్రం ఎవరి ఇన్‌ఫ్లూయెన్స్‌కూ గురవ్వరు. అక్కడ ఆయన పూర్తి స్వతంత్రంగా వ్యవహరిస్తారు. ఒకసారి నిర్ణయానికి వచ్చాక వెనక్కి వెళ్లే ప్రసక్తే ఉండదు. దానివల్ల చాలాసార్లు లాభపడిన సందర్భాలూ ఉన్నాయి, కొన్నిసార్లు నష్టపోయినవీ ఉన్నాయి. ఆర్‌పార్ జిమ్మేదార్ తనదే అని ఫిక్సవుతారు. ఏదేమైనా తన ఆత్మశక్తిపై ఆయనకు అచంచలమైన విశ్వాసం.